# మంగళాష్టకంలో తొలిమెట్టు

వడ్లపట్ల దయానందం

బంగారు జడ కుప్పెలు కటితటంతో సయ్యాట లాడుతూండగా, లేత కనకాంబరం రంగు జరీఅంచు ఉప్పాడ చీరచెరగు లోపల బుజాల మధ్య నల్లత్రాచులా మిలమిల మెరుస్తూన్న వాలు జడ వయ్యారంగా ఆడుతూండగా గుమ్మం దాటుతూ, వెనక్కి తిరిగి ఓరగాచూచి, తనవంకే చూస్తున్న వెంకటచలం కొంటె చూపులకి సిగ్గుపడి, గిరుక్కున ముఖం తిప్పేసుకుని అదృశ్యమైన రాధ నిష్క్రమణ దృశ్యాన్నే నెమరువేసుకుంటూ ఆనందం ముఖంలో చిందులు త్రొక్కుతూండగా సంతోషం హృదయంలో కుప్పిగంతులు వేస్తూండగా ఏవో తీయని ఆలోచనలతో చిరుసిగ్గు పడుతూ రాధ ఉంచిపోయిన ప్లేటులోని పకోడీలు ఒక్కొక్కటే నోటి కందించుకుంటున్నాడు వెంకటాచలం.

పట్నంలోని కాలేజీలలో నవనాగరిక (గొట్టె తోకల) జడలను చూసిచూసి విసిగిపోయిన వెంకటచలానికి ఆ దృశ్యం అపరిమితానందాన్ని కలుగచేసింది. కోల్పోయిన ఒక అమూల్యమైన వస్తువేదో తిరిగి లభించినట్లు ఫీలయ్యాడు.

తను మేనమామగారింటికి కొచ్చి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తోంది. ఆఖరుసారిగా తను రాధను చూసినప్పుడు, జుబ్బా, లంగాలలోనే ఉంది వ్యవహారం. ఈ రెండు సంవత్సరాలలోనే ఇంతగా పెరిగి పెద్దదై పోతుందన్నది వెంకటచలం ఊహించని విషయం. అలా అని ఇదివరకటి లానే బుజాలు బుజాలు కలిపి చెట్టాపట్టీలు వేసుకుని ఊరిలోని కబుర్లన్నీ చెబుతూ నిముషమైనా తనను విడిచిపెట్టక, అంటపెట్టుకుని ఉండేస్థితిలోనే ఉంటుందనీ అనుకోలేదు. అసలు రాధను గురించి ఏమనుకోడానికీ వీల్లేని పరిస్థితిలో, ప్రత్యక్షంగా చూసేద్దామన్న కుతూహలంలోనే తనొచ్చాడు. అదేమిటో, రెండు సంవత్సరాల కాలం గడపగలిగిన వాడికి ప్రయాణంలో మాత్రం ఎప్పుడా ఎప్పుడా అని ప్రాణం తహతహలాడిపోయింది. పట్నంనుంచి ఇంటిదగ్గర దిగీదిగటంతోనే మావగారి ఊరికి ప్రయాణం కట్టేసరికి తల్లి నవ్వుతూ అంది: "ఏవిట్రా అంతతొందర రేప్రొద్దుటివా ఆ మూడు ముళ్ళూ పడ్డాక మమ్మల్ని పూర్తిగా మరచిపోయేలా ఉన్నావే" అని. అసలు తనని అర్జంటుగా ఉత్తరం వ్రాయించి రప్పించిందెందుకో వెంకటచలానికి తెలుసు; అందుకే తన కాబోయే తన చిన్నరాధ ఇప్పుడు ఎలా ఉందో త్వరగా చూడాలన్న తహతహ.

తీరా చూసేసరి కేముంది? ఒక్కసారిగా ఆశ్చర్య పడిపోయాడు. అప్పటికంటే ఇప్పుడు ఒళ్ళు బాగా వచ్చింది. చక్కని ఛాయకూడా వచ్చింది- మెరుగుపెట్టిన బంగారు ఛాయలో, ప్రతిబింబాన్ని పట్టగల నునుపుతో వినూత్న, వింతాకర్షణలను కూర్చుకున్న విశాల నయనాలతో, యవ్వనపు తొలి పొంగులోని రమణీయతను నిర్వచిస్తూన్న రాధాకృతిని చూచి ఆశ్చర్యచకితుడై తర్వాత తెప్పరిల్లి పలుకరించబోతే ఏదీ— ఎక్కడుంది? సిగ్గుతో అప్పుడే తుర్రున పారిపోయింది గంటక్రితం, తనొచ్చినప్పుడు కాళ్ళకి నీళ్ళిచ్చి.

"ఓసి రాధా, ఎంతగా మారిపోయినావు? ఎంత చక్కని రూపొచ్చింది!" అనుకున్నాడప్పుడు.

ఇప్పుడు వెంకటచలం పకోడీలు తింటున్నాడు. కాని తింటున్నట్టు తనకే తెలియదు. చెయ్యి యాంత్రికంగానే పోతోంది ప్లేటువైపు; నోరూ యాంత్రికంగానే ఆడుతోంది. మనసుమట్టుకు గతంలోని మరుగుపడిన ఏవో స్మృతుల్ని పట్టి బయటికి లాగుతోంది.

ఎప్పుడో చిన్నప్పుడు, తానూ రాధా గుజ్జనగూళ్ళ ఆటలు తన మొగుడు, రాధ ఉత్తుత్తి పెళ్ళాం.

పొయ్యిమీద చిన్న పెనంపెట్టి,

ఛీ పాడుసంసారం, పిల్లలకి కూడా కరువే. మొగ దక్షతుందన్న మాటేగాని, సంసారపు గొడవ కాస్త యినా పట్టించుకుంటేనా, అన్నింటికీ నేనే ఎక్కడ పడిచచ్చేది" అంటూ వాళ్ళ అమ్మ డైలాగ్సు బట్టీపట్టి వల్లించేది. తనకి నవ్వొచ్చేది. అయినా నవ్వేస్తే ఆట రక్తికట్టదుగా మరి, అందుకు కోపం తెప్పించుకుని మావయ్యలా—

"అబ్బబ్బ, ఎప్పుడూ వెధవ గొడవ. లేనిదేదో సూటిగా చెప్పి నెమ్మదిగా తెమ్మని ఏడవకూడదూ. ఇంతకీ పిల్లలుకదూ కావల్సింది" అంటూ తను ప్రక్కకిపోయి, చీపుర్లోంచి చిటికెడు పుల్లలు లాగి (ఒకసారి అత్తయ్య చూచి, వెధవా! చీపురలా పాడుచేస్తావేరా అంటూ తంగున మొట్టింది. అది వేరే విషయం) భారంగా మోసుకెళ్ళి దుప్పట్లు కప్పిన మంచాల చాటున ఏర్పరుచుకున్న తన ఇంట్లో రాధముందు పడేసేవాడా పుల్లల మోపుని. రాధ నోటితో 'సుయ్' మన్న శబ్దంచేస్తూ, అప్పటికప్పుడే అరడజను పెసరట్లు వేసిపెట్టేది. అలా తను తిన్న ఉట్టుట్టి పెసరట్లు, తదితర పిండివంటలు, లక్షోపలక్షలు. మావయ్య కాల్చే సిగరెట్లు తస్కరించి అప్పుడప్పుడూ గుజ్జనగూటి ఆటల్లో హుందాగా నోట్లో పెట్టుకుని "ఏమేవ్ రాధా (ఒకసారి ఏంటిబాబూ నిజంగానే పేరుపెట్టి పిలుస్తావ్ అంటూ రాధ అభ్యంతర పెట్టింది, ఇదికూడా వేరు విషయమే) కాస్త నుప్పిలా తీసుకురా" అంటూ దర్జాగా ఆజ్ఞాపించేవాడు తను.

"ఛీ ఛీ పాడు అలవాట్లు ఈ సిగరెట్లు చీట్ల పేక అలవాటు ఇక జన్మలో విడిచిపెట్టవనుకుంటా ఇప్పటికే వందలకి వందలు చీట్లాటలో పెట్టేవాళ్ళకింకెవరు జ్ఞానంచెబుతారు." అనేది వాళ్ళమ్మ మావయ్యననే ధోరణిలో. తనూ అచ్చంగా మావయ్యలానే యాక్టుచేసేవాడు. "అబ్బ గట్టిగా అరవబోకే, వరండాలో పెద్ద మనుషులు."

"ఎవరా పెద్దమనుషులు ... చీట్లాట జట్టుగాళ్ళేనా."

"అబ్బబ్బ, నీకు పుణ్యముంటుంది ఊరుకోవే!" అని రాధ గెడ్డం పట్టుకునేవాడు తను. 'ఫో బావా' అని తోసేసేది.

అది గతం. భవిష్యత్తులో, ఆ ఆటల కేర్పడబోతున్న వాస్తవిక స్వరూపం పకోడీలు తింటూ అలా గతంలోంచి భవిష్యత్తులోకి దూకబోయిన వెంకటచలం మనస్సుని వర్తమానం గభాల్న పట్టి ఆపివేసింది. ప్లేటులో పకోడీలు చేతి కెంతసేపటికీ తగలకపోయేసరికి దృష్టిఆయి మరల్చి కాళీ ప్లేటు చూసి నవ్వుకున్నాడు.

పకోడీలు తినటం పూర్తికాగానే కాఫీకి ఎదురు చూస్తూ మంచినీళ్ళు తాగుతూ—'కాఫీ గ్లాసుతో వచ్చే రాధని ఎలా పలకరించాలి? ఏమని పల్కరించాలి? ఒకవేళ సిగ్గుతో మాట్లాడక తుర్రున పారిపోబోతేనో...చెంగుకాని, జెడకాని పట్టి ఆపేస్తే!"

సడన్‌గా ఆపేశాడు వెంకటచలం ఆలోచనల్ని. కాలుతూన్న కాఫీగ్లాసు చెంగుతో పట్టుకు రాధ వచ్చేస్తోంది. సిగ్గు, సంతోషం మొదలైన భావాల సమ్మేళనంతో ముఖం కొద్దిగా క్రిందికి దించింది. నొసటనున్న నల్లని, గుండ్రని 'సాదు' బొట్టుని పరిశీలనగా చూచి, "ఈ ముఖానికి ఆ బొట్టు-ఎంతో నిండిచ్చింది"అనుకున్నాడు.

వెంకటచలం ఇలా అనుకుంటూండగానే కాఫీ గ్లాసందించింది రాధ. ఒక్క చేతికి మాత్రమే గ్లాసు నందుకునే పని కల్పించి కళ్ళతో మనసారా, రాధ దివ్యమంగళ సుందర వదనారవిందాన్ని ఆదేపనిగా చూచేస్తున్నాడు. అలా చూసేస్తూ తన నోరు దారుణంగా తెరచి ఉంచబడిందన్న సంగతి కూడా వెంకటచలం గ్రహించుకో లేదు. అసలు ఇతర దృష్టుంటేగా!

రాధ కళ్ళల్లో కలువరేకుల్ని, నల్లని నొక్కుల జుత్తులో తుమ్మెద రెక్కల్ని, నాసికలో సంపెగ రేఖ వంపుల్ని, అధరాలలో దొండపండ్లని, ఇంకానంటే చెక్కిళ్ళలో బంగారు మెరుగును, వగైరాలని (నాయిక రూపురేఖల వర్ణనలని అనేకం అదివరకే చదివిఉన్నాడు కనుక) చూసేస్తున్నాడు. ఇక ఉండబట్టలేక, "అబ్బ! నీ కళ్ళు కలువరేకులు" అని అందామనుకునే, "ఛీ, ఏంబావుంటుందీ, మాటా మంచీ లేకుండా ముందే ఇటువంటి పోకడలుపోతే" అనుకుని ఊరుకున్నాడు.

వాలుకను లలా ఒకసారి పైకెత్తి వెంకటచలం కళ్ళలోకి చూసి రెండుబుగ్గలా చిన్నిసొట్టలు

పడుతూండగా చిఱునవ్వు నవ్వి — కాఫీగ్లాసు వెంకటచలం చేతిలో విడిచిపెట్టేసింది రాధ.

"రాధా నువ్వెంతదానవై పోయావ్... పెద్దదానవైనావనా అసలు మాట్లాడ్డం మానేశావ్-పోనీలే అసలు తోలుగేయటంలా, కొంతవరకూ నయమే. అవును కాని నన్నుగురించి ఎప్పుడైనా ఆలోచిస్తూ ఉండేదానవా రాధా? నిన్ను చూడాలని నేనుమాత్రం ఎంత తహతహలాడి పోయానో నీకేం తెలుసు. నామాట నమ్ముతానంటే ఓ మాట చెబుతా. నా హృదయం, మనసూ గట్రా-ఇక్కడే ఉండిపోయాయంటే నమ్ము. కిట్టిగాడు వ్యాపారంలో పడ్డాడంటగా. సీతారత్నం, సుబ్బులు, నందివర్ధనం, పుష్పలత, రత్నమాల, వాళ్ళ పెళ్ళిళ్ళు ఐపోయాయటగా. పాపం చిన్నప్పుడు రామంగాడిని మనం నందివర్ధనాని కనుకునేవాళ్ళం. ఏం, కట్నం అట్టేరాదని వాడి నాన్నే ఒప్పుకోలేదా. లేక వాడు వట్టి అల్లరి వెధవని 'వర్ధనం' తండ్రే అంగీకరించలేదా? అసలు చిన్నప్పటి ఆ సంగతులన్నీ ఇప్పుడు నీకు గుర్తున్నాయా" ఏకబిగిని ఈ మాటలన్నీ గబగబ అనేసి గ్లాసు పెదవుల కందించుకున్నాడు వెంకటచలం తనబాధ్యతతీరిపోయినట్టుగా.

అసలే సిగ్గుతో తెగ ఇదై పోతున్న రాధకి గభాల్న మాటలు దొరకలేదు. పొయ్యిదగ్గర తల్లి గ్లాసులో కాఫీ పోస్తూండగా బావతో ఏం మాట్లాడాలో అనుకుందిగాని తననుకున్నట్లు- "ఏం రాధా బాగున్నావా" అని అడుగలేదు. అలా అడిగుంటే——

"పట్నంలో కాలేజీలో చదువుకునే నీకు నేనింకా గుర్తున్నానా బావా" అని నిష్ఠూరంగా చమత్కరిద్దామని నిశ్చయించుకున్న రాధకిప్పుడు కొత్తమాటలు కావలసివచ్చి ఇంటికప్పుకేసి చూచింది. తర్వాత గదిగోడలకేసి...గోడలనున్న దశావతారాల పటాలకేసీ (క్రమంగా ఆఖరికి కిటికీలోంచి దొడ్డివైపున్న రావిచెట్టుకేసి చూచింది. (వాటిదుంఖ తెగ) రెండుకోయిలలూ ప్రత్యక్షం ఆ చెట్టుమీద. రాధ ఒళ్ళు పులకరించి సమాధానం చెప్పవలసి బాధనుండి విముక్తురాలవుదామని తెగించేసి వ్రేలితో ఆ వైపుకు మౌనంగా చూపించింది. వెంకటచలం ముఖం అటుత్రిప్పి రావిచెట్టుమీది జంటకోయిలలని చూసి——

"అమ్మ దొంగా" అన్నాడు. ఇంకా ఏమో అనబోయాడు. అంతలోనే అత్తగారు, నవ్వుతూ ముఖం చాటంత చేసుకుని గదిలో ప్రవేసిస్తూండటంవల్ల తనందామనుకున్న దనలేక

"ఏంరాధా బావున్నావా! ఏమిటీ విశేషాలు ఈ సంవత్సరం దాలికలెలావున్నాయ్ వర్షాలు గట్రా అదునులో కురిశాయా" ప్లేటుమార్చి కంగారుగా అన్నాడు వెంకటలం.

ప్లేటుమార్పును గమనించిన రాధ వెనక్కితిరిగి తల్లినిచూచి బావ ముఖంలోకి చూచి నవ్వుతూ "ఎలాగైనా చదువుకునవాళ్ళ తెలివి, చదువుకున్న తెలివే" అంది కొంటెగా.

"అమ్మయ్య ఇప్పటికి ముత్యాలు రాలేయి" అనుకున్నాడు వెంకటచలం.

"ఏమంటున్నాడేమిటే మీ బావ" అంది తల్లి నవ్వుతూ.

"ఫోవే అమ్మా" అంది రాధ తనే గదిలోంచి పోతూ.

మళ్ళా బంగారు జడకుప్పెలు తళుక్కున మెరిశాయ్. అమాంతంలేచి వెళ్ళి జడపట్టి దగ్గిరకి లాక్కుని ఆ మెత్తని పట్టుకుచ్చుతో ఆ నున్నని రాధ బుగ్గలమీద, సున్నితంగా కొట్టాలనిపించింది వెంకటచలానికి.

"ఏడిశావులే వెధవ్వేషాలెయ్యబోకు" అన్నది అంతరాత్మ.

"రాధ బొత్తిగా ఎదిగిపోయిందత్తొయ్యా!" అన్నాడు.

"ఎంతైనా నిన్ను మించలేదులే భయపడబోకు. ఎల్లుండి మంగళవారం మంచిది. లగ్నపత్రిక వ్రాయించి పంపుతున్నాం అని రేపు నువెళ్ళినప్పుడు ఇంటిదగ్గర చెప్పు." అంది అత్తయ్య.

"అబ్బే నేనివ్వేళే వెళ్ళిపోవాలి. ఆ పత్రికేదో వ్రాయింపించిస్తే నేనే తీసుకుపోతాగా" అనేసి తొందరపాటుకు నాలుక్కరచుకున్నాడు.

వెంకటచలం అత్తయ్య ఫక్కున నవ్వేసి "ఛ తప్పు, నువ్వు పట్టుకెళ్ళకూడదు చాకలాడితో పంపాలి." అంది. వెంకటచలం మనసు చివుక్కుమని సిగ్గుపడినా, రాధ జడకుప్పెలని మళ్ళా ఓ మారు గుర్తుకు తెచ్చుకుని సంతృప్తిగా నవ్వుకున్నాడు.

★